క్లుప్తంగా

ప్రజా గర్జన విజయవంతానికి పరసల్లో ప్రచారం



డొంకాడ నిర్వాసితకాలనీ పరసలో ప్రచారం చేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

అగనంపూడి: ఉక్కు పరిరక్షణ కోసం ఈ నెల 30న తృష్ణ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ కమిటీ, నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు కోరారు. నిర్వాసితులు, కాంట్రాక్టు కార్మికులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అగనంపూడిలోని డొంకాడ గ్రామంలో నిర్వహిస్తున్న తీర్థ మహోత్సవంలో నాయకులు కె.సత్యనారాయణరావు, దాసరి త్రినాథరావు, గవర సోమశేఖర్, శీరంశెట్టి గోవిందరావు తదితరులు విస్తృత ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ కేంద్రం నిర్ణయాన్ని తిప్పికొట్టడానికి నిర్వాసితులు ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో గవర సోమునాయుడు, పెదిరెడ్ల నీలకంఠం, బలిరెడ్డి సత్యనారాయణ, వంకర రాము, అట్టా అప్పారావు, డీవీఎస్‌రావు, బలిరెడ్డి సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జనలో పాల్గొనాలని కార్పొరేటర్లకు ఆహ్వానం



వంశీరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

గాజువాక : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజాగర్జనలో పాల్గొనాలని కోరుతూ గాజువాక జోన్ కార్పొరేటర్లకు వైఎస్సార్‌టీయూసీ ప్రతినిధులు ఆహ్వానాలను అందజేశారు. కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లిన నాయకులు తమ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనాలని కోరారు. కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, గుడివాడ సాయి అనూష, రాజాన రామారావు, కాకి గోవిందరెడ్డి, బట్టు సూర్య కుమారి, భూపతిరాజు సుజాత, బొడ్డు నర్సింహపాత్రుడు, ఉరుకూటి చందు, మహ్మద్ ఇమ్రాన్ తదితరులను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పిట్టా రెడ్డి, కర్రి దాలినాయుడు, నందికి తాతారావు, దాసరి పుల్లారావు, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై రాష్ట్రపతికి ఫిర్యాదు

అగనంపూడి: సమాచార హక్కు చట్టంలో సంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి నిరాకరిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యంపై భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తున్నట్టు సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త పట్టా రామ అప్పారావు పేర్కొన్నారు. 1996 నుంచి 2022 మధ్య కాలంలో విశాఖ ఉక్కు సర్టిఫైడ్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం ఎంతమంది కార్మికులను తొలగించారని సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేస్తే, ఆ సమాచారం తమ వద్ద లేదని సమాధానం ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇటువంటి సమాధానం ఇచ్చిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తున్నట్టు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వార్డు కన్వీనర్ల నియామకం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి ప్రశాంతినగర్ వార్డు సచివాలయ వైఎస్సార్‌సీపీ కన్వీనర్లుగా మామిడి శ్రీనివాసరావు, తమ్మిన శ్రీహర్ష, నెల్లి శ్రీనమ్మలను ఎంపిక చేసినట్టు వార్డు ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ ఎంపికలు జరిగాయని తెలియజేశారు.

ఉక్కు పరిరక్షణకు రాజకీయ ఉద్యమం

- 30న ప్రజాగర్జనలో వేలాదిగా పాల్గొనండి
- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాప్రతినిధుల పిలుపు
- ప్రత్యక్ష కార్యాచరణకు సమయం ఆసన్నం : ఎమ్మెల్యే నాగిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, కార్మిక నాయకులు

గాజువాక : ప్రైవేటీకరణ నుంచి విశాఖ ఉక్కు పరిరక్షణకు రాజకీయ ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజాప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. ఉక్కు ఉద్యమంలో భాగంగా ఈ నెల 30న తలపెట్టిన ప్రజాగర్జనలో ప్రజలు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గాజువాకలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, ఉక్కు పరిరక్షణ నాయకులు పాల్గొన్నారు.

అందరి భాగస్వామ్యం అవసరం

సమావేశంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కేంద్రం మెడలు వంచే విధంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయడం కోసం జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో పాటు విశాఖ ఉక్కు నిర్వాసితులను భాగస్వాములను చేయాలన్నారు. దీనికోసం ప్రజాప్రతినిధులను అవసరమైతే తానే స్వయంగా ఆహ్వానిస్తానని చెప్పారు. ఉక్కును కాపాడుకోవడం కోసం ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆ దిశగా ప్రతి కార్పొరేటర్ తమ కార్యక్రమాలను రూపొందించాలని కోరారు.

ఉక్కు పరిరక్షణ అందరి బాధ్యత

జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రజా జీవన ప్రమాణాలకు మూలాధారమైన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ పోరాటాన్ని మలిదశకు తీసుకెళ్లడం కోసం జనవరి 30న నిర్వహించనున్న ప్రజాగర్జన ఆజ్యం కావాలన్నారు.

ప్రజాఉద్యమంగా మలచాలి

72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్ మాట్లాడుతూ గత ప్రధానమంత్రులు అవలంబించిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థను నేటి కేంద్ర ప్రభుత్వం బలహీన పరిచి ఆరెస్సెస్ విధానాలను అమలు చేస్తున్నారన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలను నిర్మించి ప్రజాఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు.

సమావేశంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఉరుకూటి చందు, బొడ్డు నర్సింహపాత్రుడు, మహ్మద్ ఇమ్రాన్, కాకి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాసరావు, లేళ్ల కోటేశ్వరరావు, గంధం శ్రీనివాసరావు, బొండా జగన్, మొల్లి ముత్యాలు, రౌతు శ్రీనివాసరావు, దల్లి గోవింద్, విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, కె.సత్యనారాయణరావు, నీరుకొండ రామచంద్రరావు, మరిడయ్య, గణపతిరెడ్డి, డి.వి.రమణారెడ్డి, విళ్లా రామ్మోహనకుమార్, బొడ్డు పైడిరాజు, సీహెచ్.సన్యాసిరావు, వరసాల శ్రీనివాస్, జి.ఆర్.కె. నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



హోమం జరిపిస్తున్న వేద పండితులు

పెదగంట్యాడ: హౌసింగ్ బోర్డు కాలనీ శివారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 5.30 గంటలకు నవామృతాభిషేకం, మండపారాధన చేశారు. మహాగణపతి, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి, వాసవీ మూలమంత్ర హోమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి, మొగలపల్లి త్రిమూర్తులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కొల్లా అప్పలరాజు, చెరుకూరి నరసింహమూర్తి, బొండాడ వెంకటేశ్వరరావు, వి.ఆర్.డి.ఎన్. కుమార్, రామారావు, పచ్చిగోళ్ల గోపీ, వెంకటేశ్వర్లు, పాపారావు, సత్యనారాయణ, శ్రీను, చిట్టూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు నేతాజీ



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక: నేతాజీ సుభాష్ చంద్రబోస్ గొప్ప పోరాట యోధుడని బీజేపీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ 126వ జయంతి కార్యక్రమంలో నర్సింగరావు ప్రసంగించారు. బోస్ ఎంతోమంది స్వాతంత్య్ర సమరయోధులను తయారు చేశారన్నారు. హింద్ ఫౌజ్‌ను స్థాపించి రాజీలేని పోరాటం చేశారని, ఆయన పట్టుదల ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, శంకరరావు, ప్రసాదశర్మ, నాగేశ్వరరావు, రామస్వామి, రాజశేఖర్, వీర్రాజు, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో..

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి నత్రం కూడలిలో మహాత్మాగాంధీ సేవా సంఘం అధ్యక్షుడు చిత్తా రామారావు ఆధ్వర్యంలో బోస్ జయంతిని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి బొర్రమాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కోసూరి తాతారావు, ముత్యాల అప్పారావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పారదర్శక పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు, వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 79వ వార్డు లంకెలపాలెం సచివాలయ పరిధి గొడ్డుపేట, ఎస్సీకాలనీ, బీసీ కాలనీ, రామాలయం వీధుల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గడపకు సంక్షేమ ఫలాలు అందజేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అర్హత ఉండి, వివిధ కారణాల వల్ల ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారికి తక్షణం సహాయం చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని, పథకాలను తమ చెంతకు చేర్చిన ముఖ్యమంత్రి జగన్‌ను ఎప్పటికీ మర్చిపోమని దీవిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజలు స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ నాయకులు అన్నంరెడ్డి అజయ్ రాజ్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు జి.పూర్ణానందశర్మ, ఇల్లపు ప్రసాద్, సుందరపు అప్పారావు కింతాడ ఈశ్వరరావు, కర్రి నరసింగరావు, దాసరి తాతారావు, యలమర్తి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'జయహో జనగణమన' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహిస్తున్న జయహో జనగణమన వారోత్సవాల పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జనగణమన గీతాలాపన ప్రతి భారతీయుడి బాధ్యత అన్నారు. స్టూడెంట్స్ యునైటెడ్ నెట్వర్క్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి మాట్లాడుతూ విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ రచించిన జనగణమనను జాతీయ గీతంగా ఆమోదించి జనవరి 24కు 73 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు జిల్లాలో జనగణమన గీతాలాపన కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ముగింపు కార్యక్రమం ప్రభుత్వ మహిళా కళాశాల ఎదురుగా సెంట్రల్ పార్క్ వద్ద నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆచార్య కె.పల్లవి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు జనగణమన–రవీంద్రనాథ్ ఠాగూర్ అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు గొల్ల ప్రదీప్‌రాజ్, మహమ్మద్ ఇషాక్, నరేష్, కొయ్య రామకృష్ణ, సుధాకర్ పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ గడువు పొడిగింపుపై హర్షం

గాజువాక: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ గడువును మరో పదేళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. దళితుల అభివృద్ధికి, స్వయం ఉపాధికి, దళిత యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చి దిద్దడానికి, భూమి కొనుగోలుకు ఈ సబ్ ప్లాన్ ఎంతగానో దోహదపడుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నాయి. దళిత సంఘాలు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం జీవో విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏఐడీఆర్ఎఫ్ కార్యదర్శి మాటూరి శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు జె.వి.ప్రభాకర్, ఏఎంఎస్ అధ్యక్షుడు బి.కల్యాణరావు, కేవీపీఎస్ అధ్యక్షుడు టి.చిరంజీవి, డీహెచ్‌పీఎస్ నాయకులు జి.రాంబాబు, దళిత జేఏసీ నాయకులు పతివాడ రాంబాబు, స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య తదితరులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు తమ సంఘాల తరపున ధన్యవాదాలు తెలిపారు.

రెండో ఘాట్ రోడ్డు పనులు ప్రారంభం



కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రికి పంచవటి ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు, భక్తులు సహకారంతో ఏర్పాటు చేస్తున్న రెండో ఘాట్‌రోడ్డు పనులు సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ప్రారంభించారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్తరాంధ్ర తిరుపతిగా పెందుర్తి వెంకటాద్రి విరాజిల్లుతోందన్నారు. ప్రముఖ ఉత్సవాలు, పర్వదినాల్లో వేలాదిమంది భక్తులు వెంకటాద్రికి రావడంతో తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం కేవలం వెళ్లి వచ్చేందుకు ఒక రోడ్డు మాత్రమే ఉందని.. దాంతో రెండో ఘాట్‌రోడ్డు పనులకు దాతలు శ్రీకారం చుట్టారన్నారు. గ్రావెల్ లెవెల్ చేసి తొలుత కచ్చా రోడ్డు ఫార్మేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఆపనులు పూర్తవగానే బీటీ లేదా సీసీరోడ్డు పనులు జరుగుతాయన్నారు. తనవంతు సహకారం కూడా అందిస్తానని తెలిపారు. అర్చకులు ఎమ్మెల్యేకి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రోడ్డా.. డంపింగ్ యార్డా?



రోడ్డంతా పరుచుకున్న చెత్త

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు అప్పికొండ కాలనీ జంక్షన్ వద్ద చెత్త పేరుకుపోయింది. ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది కనీసం కన్నెత్తి చూడటం లేదు. ఇక్కడ డంపర్‌బిన్ ఉన్నా స్థానికులు ఇష్టానుసారి రోడ్డుపై చెత్త పడేస్తున్నారు. దీంతో పందులు ఆ చెత్తను చిందరవందర చేయడంతో రోడ్డంతా పరచుకుని, అస్తవ్యస్తంగా ఉంది. వాహనచోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి, చెత్త తొలగింపజేయాలి. స్థానికులకు పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కల్పించాలి. – బొట్టా రమణమ్మ, అప్పికొండ

పథకాల మంజూరుకు అర్హతే కొలమానం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 72వ వార్డు పరిధి అఫీషియల్ కాలనీలో లబ్ధిదారులను సోమవారం ఆయన కలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. చివరి దరఖాస్తుదారుడి వరకు పథకాలను మంజూరు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఆయన సత్సంకల్పానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 72వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సిరట్ల శ్రీనివాస్, నాయకులు ధనలక్ష్మి, నిర్మల, విజయ భవాని, సిద్ధా సూరిబాబు, వాసవి నాయుడు, రమణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రామిరెడ్డి, మధు, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి



శిబిరంలో పాల్గొన్న ఏసీపీ త్రినాథరావు

అక్కిరెడ్డిపాలెం: భారీ వాహనాలను నడిపే డ్రైవర్లు ఎప్పటికప్పుడ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని గాజువాక ఏసీపీ త్రినాథ్ అన్నారు. షీలానగర్‌లోని అనూరాధా ఆటో సర్వీసెస్ (పెట్రోల్ బంక్)లో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా బీపీసీఎల్, అవేర్ గ్రూప్, గ్లో సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు, జనరల్ చెకప్‌లతో పాటు రక్తదాన శిబిరం నిర్వహించారు. 110 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. 70 మందికి కంటి పరీక్షలు చేసి, కంటి పరిరక్షణపై అవగాహన కల్పించారు. రక్తదాన శిబిరంలో 30 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో బీపీసీఎల్ అధికార ప్రతినిధి బి.మురుగన్, జిష్ణు, శివకుమార్, అనూరాధా ఆటో సర్వీసెస్ ప్రతినిధి వై.రవి, మహేష్, వేణు, అవేర్ గ్రూప్ రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, కో–ఆర్డినేటర్ ఎస్.సాగర్ పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: భావితరాలను అంధకారంలోకి నెట్టే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ముఖ్యంగా విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 711వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సింటర్ ప్లాంట్ కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, జె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు ధారపోస్తోందని విమర్శించారు. నేటి ప్రభుత్వాలు సంపదను సృష్టించకపోగా.. ఉన్న సంపదను నాశనం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కుంభా రవిబాబు లేఖ



స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు రాసిన లేఖను స్టీల్‌ప్లాంట్ ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఉక్కు ఉన్నతాధికారులకు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎం.కె. నాయక్, కార్యదర్శి జి.జి. సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జి. గురుమూర్తి సోమవారం సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి, హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావులను కలిశారు. అనంతరం రవిబాబు లేఖను వారికి అందించారు. స్టీల్‌ప్లాంట్ పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు జరిగేలా చూడాలని, ఉన్నత పదవుల్లో ఎస్టీలను నియమించాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, ఎస్టీ అసోసియేషన్‌కు కార్యాలయం కేటాయించాలని, క్వార్టర్స్ కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేయాలని, కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. సమస్యలపై యాజమాన్యం సానుకూల చర్యలు తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికులు తరలి రావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజాగర్జనకు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద ఎత్తున తరలి రావాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఎల్ఎంఎం పార్కు వద్ద సోమవారం జరిగిన అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో ప్రజా గర్జన గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో సాధించుకున్న ప్లాంట్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మంది ఆధారపడి ఉన్నారన్నారు. దానిని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం యోచించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ పన్నాగాన్ని ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కోవాల్సి ఉందని తెలిపారు. అందరూ కలిసికట్టుగా వ్యవహరిస్తేనే ప్రభుత్వం దారికి వస్తుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఓ.వి.రావు, ఎస్. రమణ, జి.శ్రీనివాసరావు, బొడ్డ గోవింద, పిట్టా రెడ్డి, మురళీకృష్ణ, సత్యారావు, త్రినాథ్‌రెడ్డి, గుర్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గర్జనకు మద్దతుగా దీక్ష

సింహాచలం: అనేక మంది ప్రాణత్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, దాన్ని ప్రైవేటు పరం చేయాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని తిప్పికొట్టాలని రాజకీయ, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఈనెల 30న జరిగే ఉక్కు ప్రజా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం పెందుర్తి కూడలిలో సంఘీభావ దీక్ష జరిగింది. సీపీఎం, టీడీపీ, సీపీఐ ఎంఎల్(ఎన్‌డీ)తదితర పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. విశాఖ ఉక్కు మనందరి హక్కు అని, ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకుందాం అని, బీజేపీ ప్రైవేటీ కరణ విధానాలను తిప్పికొడదామని నినదించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటన చేసి ఈనెల 27వతేదీకి రెండేళ్లు అవుతోందని, ఈతరుణంలోనే జనవరి 30న విశాఖ ఉక్కునగరంలో కార్మిక గర్జన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని ప్రలంతా కార్మికులకు అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, సీపీఎం పెందుర్తి ఏరియా కార్యదర్శి బి.రమణి, సీపీఐ ఎంఎల్‌డీ నాయకురాలు కె.నిర్మల, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల ఆర్.శ్రీనివాసరావు, విమల, ఎస్‌కే.రెహమాన్, కె.సత్యనారాయణ, రాంబాబు, కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.